రీతిక కథ



# అమ్మరైలు



గోపరాజు నాగేశ్వరరావు

ప్రకృతి చిత్రాన్ని కత్తిరించుకొంటో రైలు కదిలిపోతోంది!

వినయ్ కిటికీ ప్రక్కనే ఓ మూలగా కూచొని ధ్యానంగా బయటికి చూస్తున్నాడు.

ఎదరగా విశ్వం, కాంతారావూ కూచున్నారు.

వాళ్లంతా గుంటూర్లో ఉద్యోగాలు చేస్తుంటారు. రోజూ పొద్దున్నే అదే రైల్లో గుంటూరు వెళ్లి సాయంత్రం రైలుకు తిరిగొస్తుంటారు.

రైలు సాతులూరు స్టేషన్ దాపులో కొచ్చింది.

తత్వాలు పాడే బిచ్చగత్తె ఆ స్టేషన్లోనైనా రైలెక్కుతుందేమో నన్న ఆశ!

బిచ్చగత్తె గుర్తుకురాగానే కదలకుండా ఉన్న నీటి బుగ్గ గాలి తరంగాల తాకిడికి లీలగా జల్దరించినట్టో వినయ్ మనసులో ఓ చిన్న ప్రకంపన!

బిచ్చగత్తె కనిపించి నెలరోజులైనా ఆమె తన దగ్గరే నిలబడి తత్వం పాడుతున్నట్టో యేదో భ్రమ! ఆమె పాడుతుంటే రోహిణి సెగలో ఒంటికి తేమగాలి తగిలినట్టో యెంత పులకింతగా ఉంటుందో!

మనసు పొరల్లోంచి ఆమె పాట జ్ఞాపకాలు పొడుచుకొస్తో....

"గూడూ చినబోయెరా--
చిన్నన్నా గూడూ చినబోయెరా....."

రైలు కీచుమంటో సాతులూరు స్టేషన్లో ఆగింది. నిమిషం తర్వాత బద్ధకంగా ఒళ్లు విరుచుకొని మళ్లీ బయలుదేరింది.

బిచ్చగత్తె అక్కడా రైలెక్కలేదు!

కాంతారావు తన కేసి చూడకపోయినా అతను తనకేసే చూస్తో హేళనగా నవ్వుతుంటాడనిపించింది వినయ్కి. అందుకే అసలు కాంతారావు వేపే చూడకుండ జాగ్రత్త పడుతో లోలోపలే ఉడికిపోతున్నాడు వినయ్.

'ఆరోజు కాంతారావు అన్నట్టు బిచ్చగత్తె చేతిలో మోసపోయానా?' ప్రశ్నించుకున్నాడు వినయ్.

అసలారోజు జరిగిందేమంటే.....

* * *

రోజూటికి మల్లేనే వినయ్తో సహా అంతా రైల్లో వెల్తున్నారు. దారి మధ్యలో వర్షం మొదలైంది. ఆకాశం నిండా కారుమబ్బులు కమ్ముకొని పట్టపగలే చీకట్లు ముసిరేయి.

తత్వం పాడుతో బిచ్చగత్తె వస్తోంది....

"గూడూ చినబోయెరా--
చిన్నన్నా గూడూ చినబోయెరా...."

పట్టాల మీద యినప చక్రాల రాపిడికి రైలు చేస్తోన్న లయబద్ధమైన శబ్దంతో పాటు ఆ బిచ్చగత్తె పాడుతున్న తత్వం-- ఆ చినుకుల్లో, ఆ ముసురుకున్న చీకట్లలో, ఆ రైలు ప్రయాణం వినయ్ని వూహాలోకాల్లోకి విసిరేసింది!


"కొండ మీదా బండి వాలెను
గుండె రెండూ ముక్కలాయెను"

బిచ్చగత్తె గొంతెత్తి పాడుతోనే ఉంది.

విశ్వం తలెత్తి వినయ్ కేసి చూస్తో--

"ఓ పల్లెటూరుకి పాడుబడ్డ గుడికీ మధ్య చెరువు గట్టు మీద మాధాకబళం తిని రాత్రి వేళల్లో చుక్కల కింద కూచొని గుడికేసి చూస్తో ఈ తత్వం ఇలాగే పాడుతున్నట్టో-- ఆ దృశ్యాన్ని వూహిస్తేనే యెంత బావుంటుందో" అన్నాడు.

వినయ్ ఆశ్చర్యంగా విశ్వం కళ్లలోకి చూసేడు.



రీతిక కథ

విశ్వం యెవర్తోటీ చనువుగా మాట్లాడ్డు. తనకో ప్రత్యేకమైన ప్రపంచాన్ని సృష్టించుకొని పరులకోసం అంతరాత్మను గిరికీలు కొట్టించే దురవస్థకు దూరంగా తన ప్రపంచంలో తను జీవిస్తుంటాడు.

అలాంటి విశ్వంలో గుంబనంగా యెంత భావుకత?

బిచ్చగత్తె వాళ్ల దగ్గరి కొచ్చింది.

"గూడూ చినబోయెరా
చిన్నన్నా గూడూ చినబోయెరా"

కాంతారావు ముఖం చిట్లించి పక్కకు తిరిగేడు. అతను సామాన్యుడేం కాదు. రాజకీయాలన్నీ ఔపోశన పట్టిన వాడే. ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తి సాధనాల మీద ఉత్పత్తి శక్తుల అజమాయిషీ ఒస్తేనే తప్ప ఆకలి, దరిద్రం పోవంటో రైల్లో కూడా విశ్రాంతి లేకుండా వాదిస్తుంటాడు.

కాంతారావు వాళ్ల నాన్న లేట్ అరుణాచలంగారు రజాకారు మూమెంట్లో దొంగ తనంగా కమ్యూనిస్టులకు ఆయుధాలు అమ్మేవాట్ట. వాళ్లు వర్గ శత్రువుల నించి తెచ్చే డబ్బు, బంగారం దాచిపెట్టేవాట్ట. తండ్రిగారి ఆదేశం మీద కాంతారావు చదువుకునే రోజుల్లో ఫెడరేషన్‌కు నాయకత్వం వహించేట్ట.

కాంతారావుకు తిండి, బట్ట, ఇల్లుకు దిగుల్లేదు. గుంటూర్లో రెండు బార్లూ, మెయిన్ రోడ్డు పక్కనే బంగారం కొట్టూ, ఊరి వెలపల పెద్ద రైసు మిల్లూ, నాలుగు టాక్సీలు, ఐదో ఆరో ట్రేడ్ యూనియనకు అధ్యక్ష పదవీ--

అలా రెండు చేతులా సంపాదించేందుకే సమయం చాలక పోతున్నా చనిపోయిన తండ్రిగారి ఆత్మమీది గౌరవంతో ఇంకా తీరిక వేళల్లో శ్రామికవర్గ పక్షపాతం వహిస్తోనే ఉన్నారు......

బిచ్చగత్తె మీంచి గాలి కాంతారావు వేపు వీచింది. సిల్కు లాల్చీ జేబిలోంచి కర్చీఫ్ తీసి ముక్కుకు అడ్డం పెట్టుకొంటో కొంచెం ముందుకు ఒంగి వినయ్ చెవిలో చెప్పేడు--

"అబ్బా..... ఈ కంపు ముండతో చావొస్తోంది. మస్తాన్ గాడి గుగ్గిళ్ల బుట్ట ముందొచ్చి దాని వెనక అతుక్కొని వాడొచ్చేట్టే దీనికన్నా ముందే దాని చమట కంపొస్తుంది"

బిచ్చగత్తె మరికొంచెం ముందుకు జరిగి--

"గూటినున్నా రామచిలుకా
గువ్వలా పొలాయెరన్నా--
గూడూ చినబోయెరా....."

పాడుతో నించుంది. ఆమె ప్రక్కనే యెవరో పిల్లాడున్నాడు. వినయ్‌కి వాణ్ణి చూస్తే ముచ్చటేసింది.

"ఆ పిల్లాడెవరు?" అడిగేడు.

"నా కొడుకు" గర్వంగా చెప్పిందామె

వినయ్ పిల్లాడికేసి తిరిగి-- "మీ అమ్మలాగా పాట్టంనీకొచ్చా?" అడిగేడు.

వాడి ముఖంమీద చిర్నవ్వులు ముసిరేయి.

బిచ్చగత్తె అంది-- "ఈ పాటల్తో వాడికేం పని బాబూ వాణ్ణి ఇంగ్లీషు బళ్లో చదివిస్తున్నా"

అంతే.... కాంతారావు విశ్వం చెవి దగ్గరికి జరిగేడు, "అడుక్కుతింటంలో కొత్త యెత్తు సార్, ఈ అలగా జనం మన సెంటిమెంట్లను క్యాష్ చేసుకుంటారు. జాగ్రత్తగా ఉండకపోతే ఈ భూస్వామ్య బూర్జువా పెట్టుబడి దారి సమాజంలో బతకలేం సార్....." బంగారపు తాడుకు వేలాడు తోన్న పులిగోర్ను నోట్లోకి తోస్తో చెప్పేడు కాంతారావు.

విశ్వం ఏం మాట్లాళ్లేదు. పర్సులోంచి కొంత చిల్లర తీసి బిచ్చగత్తె చేతిలో పెట్టి యేదో పుస్తకంలో మునిగిపోయేడు.

కాంతారావు అన్నది వినయ్‌కి వినిపించలేదు. పిల్లాడి వేపు చూస్తో అడిగేడు--

"ఏం చదువుతున్నావ్ బాబూ?"

"యూకేజీ"

కొడుకు చెయ్యి పట్టుకొని బిచ్చగత్తె వెళ్లబోతోంది.

"తత్వం ఇంకోసారి పాడవూ?" అడిగేడు వినయ్.

ఆమె తటపటాయించి క్షణం తర్వాత చెప్పింది- "రేపు పాడ్తాలే బాబూ. డబ్బులు కట్టలేదని పిల్లాణ్ణి బళ్లోంచి పంపించేశారు. ఇంకో ఇరవై రూపాయలు చూసి వాడికి

పొద్దున్నే డబ్బులిచ్చి పంపాలి"

వినయ్ జేబిలోంచి డబ్బు తీసి ఆమె చేతిలో పెడుతూ "ఇరవై నేనిస్తున్నాను కానీ పాట పాడవూ?" అన్నాడు.

"మోసపోతున్నారు సార్" కాంతారావు గుసగుసా చెప్తున్నాడు

బిచ్చగత్తె సంకోచించకుండా డబ్బు తీసుకొని వేసులు బాటుగా గొంతు విప్పింది-

"ఎక్కలేనీ పర్వతాలూ
నూరుమార్లా నిచ్చెనేసిన
ఎక్కడ చూసినాగానీ
చిలుక జాడా కానరాదూ...."

ఆమె పాడుతూనే ఉంది. అలా యెన్ని సార్లు ఆమె ఆ తత్వం పాడుతున్నా ఆ గొంతు వెనక గుండెలో మేటవేసుకున్న యేదో దుఃఖం పొరలు పొరలుగా పైకి లేస్తో ఆమె గాయల్ని కెలుకుతున్నట్టుంటుంది.!

ఆమె గొంతు అంత మధురంగా కూడా ఉండదు. పెద్ద పాటగత్తె అంత కన్నా కాదు. గొంతు మధ్యలో విషాద జీర ఆ తత్వానికి ప్రాణం పోస్తోంది.

ఏదో తెలియని ఆమె విషాదమే ఆ పాటకు ప్రాణం!

బిచ్చగత్తె పైట కొంగుతో కళ్లొత్తుకుంది.

కాంతారావుఆమెనే చూస్తున్నాడు. గొర్బాచేవ్ నెత్తిమీద పశ్చిమ ఐరోపా పఠంలా ఉండే మచ్చలాంటి మాసికలే ఆమె చీరంతా!

"మీ ఆయనేం చేస్తుంటాడు?" వినయ్ ఆమెను అడిగేడు.

ఆమె వినయ్ కళ్లలోకి చూసింది. "వీడు కడుపున పడగానే పారిపోయాడు బాబూ" అంది విషాదంగా


బిచ్చగత్తె వెళ్లిపోతోంది. ఆమెతో పాటే పాట కూడా వెళ్తోంది.

"ఎక్కడ చూసినాగానీ
చిలుక జాడా కానరాదూ-
గూడూ చినబోయెరా....."

'చిలుక జాడా కానరాదు' అన్నప్పుడు హృదయ విదారకంగా వినిపించిన ఆ పాట విరుపుకు వినయ్ గుండె బరువెక్కింది.

ఆమె అటు వెళ్లగానే కాంతారావు వినయ్‌తో అన్నాడు-

"ఎందుకు సార్ అంతసెంటిమెంట ల్‌గా ఆలోచిస్తారు? ఈ వ్యవస్థలో ఇలాంటివన్నీ సహజం. కానీ ఇలాంటి బాధాతప్త జీవుల్ని ఉద్ధరించేందుకు తూరుపు దిక్కున అరుణ రేఖలు...." వినయ్ తమాయించుకొని లేచి దూరంగా వెళ్లి తలుపు దగ్గర నించున్నాడు.




పాపం కాంతారావు... కేవలం సంపాదన కోసం రాత్రిం బవళ్లూ విలువైన కాలాన్ని వృధాచేస్తో అప్పుడప్పుడూ వెసులుబాటు కోసం విప్లవం చెప్తుంటాడు. ఆ ఆనందా నిక్కూడా అతన్ని దూరం చెయ్యటం మానవత్వం మనిపించుకోదు.

అక్కడ కాంతారావు అంటోన్న మాటలు వినయ్‌కి వినిపించేయి.

"పాపం. వినయ్‌గారు మోసపోయారు."

* * *

రైలు ఫిరంగిపురం స్టేషన్లో ఆగింది. క్రాసింగున్నట్టుంది. గుంటూరు నించి రావాల్సిన రైలు కోసం ప్లాటుఫాం మీద కొంతమంది జనం యెదురు చూస్తో నించున్నారు.

విశ్వం పుస్తకం చదువు తున్నాడు.

కాంతారావు పార్టీ పునర్నిర్మాణం గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

పక్క అరలో పేకాట జరుగుతోంది.

స్టేషన్లో గంటమోగిన కొంచెంసేపటికి అటునించి బండొచ్చి ఆగింది. స్టేషన్‌లో కలకలం! 'ఆ.... వేడివేడి బఠాణేయ్....' 'కొత్త కాయల్కొత్తకాయల్ సెనక్కాయలేయ్....' 'హే-- టీ, హే-- టీ'.

ఆ రైలు వెళ్లిపోయింది.

ఈరైలూ కదిలింది.

బండి ఔటర్ సిగ్నల్ దాటి వేగం పుంజుకోసాగింది. యినప రాపిడి శబ్దాల్లోంచి రైలు కూత కిటికీల దగ్గర సుళ్లు తిరుగుతో గాలి గోల!

దూరంనించి లీలగా--

"గూడూ చినబోయెరా
చిన్నన్నాగూడూ చినబోయెరా...."

అదే తత్వం. అదే విరుపు. అదే లయ. అదే విషాదం. అడ్డంకుల్ని ఛేదించుకొంటో పెల్లుబుకుతోన్న పాతాళగంగలా......

"కొండమీదా బండి వాలెను
గుండె రెండూ ముక్కలాయెను...."

విశ్వం నొసలు చిట్లిస్తో "పాడేది ఆమె కాదు" అన్నాడు.

పాట ధ్వని దగ్గరికొచ్చింది.

"ఎక్కలేని పర్వతాలూ
నూరు నూర్లా నిచ్చెనేసిన....."

పాట ఆపి బిచ్చగత్తె కొడుకు వినయ్ వేపే చూస్తో నించుండిపోయేడు.

పెట్టుకున్న నమ్మకాలన్నీ కాదని గేలి చేస్తో కళ్లముందే కూలిపోతోంటే కనిపించే నిస్సహాయతే వినయ్‌లోనూ కనిపించింది

"అయితే నువ్వూ రైల్లో అడుక్కుతినే వాడివేనా? ముష్టి ఇరవై రూపాయలకోసం నువ్వూ, మీ అమ్మ యెంత నాటకం ఆడేరు" వినయ్ రెచ్చిపోయేడు.

విశ్వం వాడికేసి చూసేడు. వాడు వెక్కిళ్లా పెడుతున్నాడు.

"మీ అమ్మేది?" వాణ్ణి విశ్వం అడిగేడు.

"అమ్మ.... రైలు కింద పడిపోయింది. కాలు తెగిపోయింది" చెప్పేడు వాడు వెక్కుతో. వాతావరణం పూర్తిగా మారిపోయింది.

"ఎప్పుడూ?" కంగారుపడుతూ అడిగేడు వినయ్

"ఆరోజే సార్-- మీరు నా ఫీజు డబ్బులిచ్చినరోజే"

"ఎలా జరిగింది?"

"అమ్మా నేనూ గుంటూర్నించి మధ్యాహ్నం రైల్లో వెనక్కొస్తున్నాం. పక్క లైను మీద మాచర్ల వెళ్లే రైలు కూడా మా రైల్తో పాటే చిన్నగా వెల్తున్నది. ఆ రైలు పెట్టెలోకి చూసి అమ్మ పెద్దగా "అడుగోరా మీ నాన్న" అంటూ ఆ రైలు యెక్కాలని ఈ రైల్నుంచి దిగబోయి చక్రాల కింద పడ్డది" వెక్కిళ్ల మధ్య మాటలు పెగిలిస్తా చెప్పేడు వాడు

"ఇప్పుడెక్కడుంది?"

"కాళీగా ఉన్న డ్రైనేజి తూములో ఉంచి ఈ రైలు కోసం వచ్చాను. అమ్మ ఆస్పత్రిలో ఉన్నప్పుడే నాకు పాట నేర్పింది సార్" ముక్కుతో ఒకే విడత రెండు సార్లు గాలి పీలుస్తో చెప్పేడు వాడు.

పేక ముక్కలు సరిగా పడక డ్రాప్ చేసిన వాడెవడో కిటికీ దగ్గర నిలబడి అంతా విన్న తర్వాత వినయ్ వాళ్లతో "మీరంతా చేద్దామంటే వీళ్లకు మేం కూడా డబ్బిస్తాం సార్. ఆటకో అర్ధరూపాయి తీసిన చాలా వస్తాయి" అన్నాడు.

వినయ్ అతడికేసి సౌమ్యంగా చూసేడు.

మళ్లీ పేకేసి పిలిస్తే అతను వెళ్లిపోయేడు.

"భర్త కోసం ఆమె యెంత తపనపడుతోంది? నిజంగా చాలా గొప్పది" వినయ్ విశ్వంతో అన్నాడు.

విశ్వం వినయ్‌ని ఆస్పత్రి సెల్‌లో ఉన్న పిచ్చివాణ్ణి దూరంనించి చూస్తున్న అప్పుళ్లా చూసేడు.

కొద్దిరోజుల పాటు ఒక మగవాడికి శరీరాన్నిచ్చి వాడు ద్రోహంచేస్షి పోయినా బిచ్చగత్తె వాణ్ణే ఆరాధిస్తో పరితపిస్తో స్త్రీ బలహీనతకు మరో ప్రతీకగా మిగిలింది. వినయ్ అది ఔన్నత్యమను కొంటున్నాడు!

పేకాటలో డబ్బుతీసి .బిచ్చగత్తెకిస్తామన్న వారిక్కూడా యెలాంటి సైకలాజికల్ కమిట్ మెంటుండదు. వాళ్లు మందిరానికి ఇస్తారు. మసీదుకూ ఇస్తారు. ఏదో ఒక పార్టీకి సర్దాగా ఓట్లేద్దామనుకొంటే అంతా అదే పార్టీకి వేస్తారు. అంతదూరం ఏం పోతాలేబ్బా అనుకొంటే ఎలక్షన్ రోజంతా సర్దాగా పేకాడుకుంటారు!

ఇక కాంతారావు లాంటి వాళ్ల విషయాని కొస్తే తొలిసంధ్యకు భూపాల రాగంలో కాకుండా సింహేంద్ర మధ్యంలో ఆహ్వానించాలనే కపటపు తిరుగుబాటు తొడుగులో ముడుక్కున్న మెతకబారని లోహత్వం! వాళ్లు మహత్తర సిద్ధాంతానికీ, మామూలు మనుషులకూ మధ్య గండిని పెంచే శిఖండులు!

అలాంటి వాళ్లనించి సమాజం యేం ఆశించినా అది హాలహాలంతో ఆగిపోయే క్షీరసాగర మథనం!

విశ్వం కుదుటపడుతో "బాబూ! నీకేం కావాలన్నా మమ్మల్ని అడుగు. ఇబ్బంది పడొద్దు" అన్నాడు.

"ఇబ్బందేం లేదు సార్. బిచ్చగాళ్లంతా కలిసి మాకు సహాయం చేస్తున్నారు. పైగా నాక్కూడా అమ్మ రైలుందిగా.. మీ దయ వుంటే చాలు సార్"

"బాబూ!" వినయ్ ఆపైన మట్లాళ్లేకపోయాడు.

"కానీ సార్...! ఆయన కోసం అమ్మ రైలు దూకింది.... రైల్లోంచి దూకేసింది సార్" అంటో వెక్కిళ్లు పెట్టి ఏడుస్తో పిలుస్తున్నా ఆగకుండా వాడు వేగంగా వెళ్లిపోతున్నాడు.

"కొండ మీదా బండి వాలెను
గుండె రెండూ ముక్కలాయెను..."

యినప రాపిడి శబ్దాల్లో పాట విలీనమైపోతోంది.

విషాదాన్ని మోసుకొంటో అమ్మ రైలు కదిలిపోతోంది. ●

